06ATP27_06ATP27.qxd 22-07-2025 PM 11:09 Page 1



## విత్తన శుద్ధి ద్వారా వేరుశెనగలో పురుగుల ఉద్ధృతిని తగ్గించవచ్చు

-మూలగిరిపల్లి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ, ఏవో



మూలగిరిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

ఉరవకొండ, జూలై 22 ప్రభాతవార్త

వేరుశెనగ పంటలో పురుగుల ఉద్ధృతి అధికంగా ఉందని పంట పెట్టడానికి ముందు క్లోరోఫైరిఫాస్ మందును 6ఎంఎల్ ఒక కేజీ విత్తనాలకు కలిపి శుద్ధి చేసుకుంటే పంటలకు పురుగులు ఆశించవని ఏడీఏ ఎస్.సత్యనారాయణ, ఏవో బి.రామకృష్ణుడు సూచించారు. మండల పరిధిలోని మూలగిరిపల్లి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి వేరుశెనగ పంట పొలాన్ని సందర్శించి ఎన్ఎంఈవో-ఓఎస్‌లో విత్తనం ఇచ్చిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బి.రామ కృష్ణుడు

సందర్భంగా ఏడీఏ, ఏవో మాట్లాడుతూ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న, సద్ద పంటలను కంచె పంటలుగా వేసుకోవాలని సూచించారు. పొలంలో అక్కడక్కడ పంగల కర్రలు నాటుకుంటే పక్షులు దానిపై వాలి పురుగులను తిని నాశనం చేస్తాయన్నారు. తిక్క ఆకుమచ్చ తెగులు, బూజు తెలుగు నివారణకు సాఫ్ 2ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పంటల బీమాకు ప్రీమియం చెల్లించడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడించడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశెనగకుకు ఎకరాకు 640 రూపాయలు, కందికు 80 రూపాయలు, పత్తికు 1,140 రూపాయలు, టమోటాకు 1,600 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## 25 నుంచి చిదంబరేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

-నెరమెట్ల గ్రామంలో సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం

ఉరవకొండ, జూలై 22 ప్రభాతవార్త



కళశ ప్రతిష్టాపనకు ముస్తాబు చేసిన గోపురం

మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలోని చిదంబరేశ్వరస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం శ్రావణ శుద్ధ పాడ్యమి శుక్రవారం నుండి తదియ ఆదివారం 27వ తేదీ వరకు గోపురం, కలశ, వినాయక, సుంకలమ్మదేవి శిలా విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం జరుగుతుందని గ్రామ ప్రజలు, భక్తులు తెలిపారు. 25న ఉదయం శుక్రవారం ఉదయం గంగపూజ, స్వామివారికి అభిషేకం, మహా మంగళ హారతి, విగ్రహాల జలాధిహారతి, 26నశనివారం గణపతిపూజ, ఉమామహేశ్వర, ఆదిత్యాదినవగ్రహ, అష్టదిక్పాలక, పరివారదేవతాపూజ, సాయంత్రం గణపతి, నవగ్రహ, రుద్ర, వాస్తు హోమాలు, 27న ఆదివారం ఉదయం విగ్రహాలు, గోపుర కలశ ప్రతిష్టాపన, జయాది హోమం, మహామంగళ హారతి కార్యక్రమం, మధ్యాన్నం భక్తులకు అన్నదానం జరుగనుంది.

## ఉరవకొండలో 10.2 మిల్లీ మీటర్ల వర్షం

-కమ్ముకున్న కారు మబ్బులు, కురుస్తున్న తుంపర జల్లులు

ఉరవకొండ, జూలై 22 ప్రభాతవార్త



వర్షం కురుస్తున్నప్పటి చిత్రం

ఉరవకొండ ప్రాంతంలో సోమవారం రాత్రి కురిసిన వర్షం 10.2 మిల్లీ మీటర్లుగా నమోదైంది. రాత్రి 8 గంటల నుండి దాదాపు 2 గంటలపాటు తుంపర జల్లులతో మోదలు ఒక మోస్తారు వర్షం కురిసింది. గత మూడు నాలుగు రోజుల నుండి వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకోగా ఆకాశం మోఘావృతమై కనిపిస్తోంది. ప్రతిరోజూ అప్పుడప్పుడూ తుంపర జల్లులు కురుస్తూనే ఉండటంతో చల్లదనం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో పంటలకు పెట్టుకోవడానికి అనువైన వర్షం కురవడంతో రైతులు పంటలు పెట్టుకోవడంలో బిజీగా కనిపిస్తున్నారు.

## రెండేళ్లుగా పశువైద్యాధికారి లేరు.. మృత్యువాత పడుతున్న మూగ జీవాలకు దిక్కెవరు

అగళి, జులై 22 ప్రభాతవార్త

అగళి మండలంలో గత రెండేళ్లుగా పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో రైతులు మేపుతున్న గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు చికిత్స చేసేవారే కరువయ్యారని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడురోజులక్రితం కరిదాసనపల్లి గ్రామంలో లక్ష రూపాయలు విలువచేసే గేదె అనారోగ్యంతో మృత్యువాత పడింది. రైతు హనుమంతప్పకు చెందిన గేదె మృత్యువాత పడటంతో రైతు కన్నీటి పర్యంతమయ్యారు. కన్నబిడ్డలా సాకుతున్న గేదె ఉన్నఫలంగా అనారోగ్యంతో మృతి చెందిందని, వైద్యం చేసేవారు కూడా లేరని, కర్ణాటక రాష్ట్రం కార్పెపల్లి, బడవనపల్లి, శిర ప్రాంతాల నుంచి వైద్యులను రప్పించి మూగ జీవాలకు వైద్యంచేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సదరు గేదెకు ఇన్సురెన్స్ సౌకర్యం లేకపోవడంతో రైతు ఇబ్బంది పడుతున్నారు. గత రెండేళ్లుగా ఇన్సురెన్స్ వెసులుబాటు లేక మృతి చెందిన మూగ జీవాలకు దిక్కులేకుండా పోయింది. కనీసం మృతి చెందిన ఆవులు, గేదెలకు, గొర్రెలకు పరిహారం కాని, ఇన్సురెన్స్ కానీ అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేనద వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెటర్నరీ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని అనారోగ్యంతో మృతి చెందుతున్న మూగ జీవాలకు ఎలాంటి ఇన్సురెన్స్ సౌకర్యం లేకున్నా వారికి ఆర్థిక సౌకర్యం లేకున్నా పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## బదిలీపై వెళ్ళిన సచివాలయం సిబ్బందిని సత్కరించిన జిల్లా కళాకారుల సంఘం సభ్యుడు

గుమ్మఘట్ట జూలై 22 ప్రభాతవార్త



గుమ్మఘట్ట సచివాలయంలో పనిచేసి, బదిలీ పై ఇతర సచివాలయం కు బదిలీపై వెళ్తున్న డిజిటల్ అసిస్టెంట్ సందీప్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామంజీ ను జిల్లా కళాకారుల సంఘం తరుపున గోనబావి పోగునులు రంగస్వామి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ గుమ్మఘట్ట సచివాలయం లో ప్రజలకు ఉత్తమ సేవలను అందించారని, ఇలాగే బదిలీ అయిన సచివాలయలలో కూడ ఇలాగే ఉత్తమ సేవలను ప్రజలకు అందించాలని కోరాడు. అలాగే జీవితం లో ఉన్నత స్థానం లో ఉండాలని ఈ సందర్భం గా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి జగదీష్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీమా చెల్లింపు పై ఆందోళనలో రైతులు..

ప్రభుత్వం గడువు పెంచిన ప్రీమియం చెల్లించలేకపోతున్న రైతులు

వజ్రకరూరు జూలై 22 ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు భీమాచెల్లింపు గడువును ప్రభుత్వం ఈనెల 31వరకు పెంచింది. మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకు వద్దకు రైతులు ప్రీమియంచెల్లింపుకు వెళుతుంటే వారు ప్రీమియం కట్టించుకోవడానికి నిరాకరిస్తుండడంతో రైతులు తీవ్ర అందోళనకు గురవుతున్నారు. దీంతో రైతులపరిస్థితి దేవుడు కరుణించిన పూజారి అడ్డుపడిన చందంగా మారింది. తమకు పనిలో ఒత్తిడిఉన్నందున, సిఎసి సెంటర్‌కువెళ్లాలని సూచిస్తున్నారు. సిఎస్‌సి సెంటర్ నిర్వాహకులు వారు కంది పంటకు మాత్రమే ప్రీమియం కట్టిస్తున్నట్టు తెలుపుతున్నారు. దీంతో రైతులు ప్రీమియం ఎక్కడ చెల్లించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై వ్యవసాయ, బ్యాంకు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి ప్రీమియం చెల్లింపులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

## హుండీ లెక్కింపు ద్వారా 3.76 లక్షలు ఆదాయం

అమరాపురం జూలై 22 ప్రభాతవార్త



హుండీ లెక్కింపు దృశ్యం

అమరాపురం మండలం హేమా వతి గ్రామములో వెలసిన హేంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయము యొక్క శాశ్వత హుండీలను మంగళవారం ఉదయం లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో నరసింహారాజు సమక్షంలో నిర్వహించిన లెక్కింపు ద్వారా 3 లక్షల 76,532 రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో కర్నూల్ ఉప కమిషనర్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మహేష్, ఆలయ కమిటీ ధర్మకర్త కరెగౌడ, కుమార స్వామి, గొల్లమారనపల్లిరామచంద్రప్పతిప్పజ్జ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత,రైతుసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం...!



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్

ధర్మవరం, జూలై 21(ప్రభాతవార్త)

చేనేత, రైతు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమదులు మండిపడ్డారు. స్థానిక ఎన్జీఓహోంలో సోమవారం నియోజకవర్గ 8వ సీపీఐ మహాసభలను నిర్వహిం చాచు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ధర్మవరంలో చేనేత వృత్తి కింద అన్ని వర్గాల ప్రజలు ఆరాదపడి జీవిస్తున్నారన్నారు. గతంలో చేనేత పరిశ్రమ కళకళాలాడేదన్నారు. రానురాను ముడిపట్టుసరుకులు ధరలు పెరగడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతోపాటు ప్రభుత్వాలు ఆదుకోకపోవడంతో పరిశ్రమ నేడు కుదేలైందన్నారు. గతప్రభుత్వంలో చేనేత కార్మికులకు రూ.24వేలు వచ్చేదని ప్రస్తుతం వచ్చే పరిస్థితులు కనిపించలేదన్నారు. అదేవిధంగా రైతుల పరిస్థితి కూడా అత్యంత దారుణంగా ఉందన్నారు. భూములున్నపంటలు పెట్టుకునే పరిస్థితులు కనిపించలేదన్నారు. లక్షల రుపాయిలు పెట్టుబడులు పెట్టినా తీరా పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు రాక పెట్టిన పెట్టుబడులు కూడా రానిపరిస్థితులున్నాయన్నారు. అంతేకాకుండా కార్మిక, కర్షకులకు అదే పరిస్థితి ఉందన్నారు. సీపీఐ ప్రజాసమస్యలపై నిరంతరంపోరాటాలు సాగిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో చేతివత్తిదారులసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి, రైతుసంఘ జిల్లా వర్కింగ్‌ప్రసిడెంట్ కాటమయ్య, ఏపీచేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శులు వెంకటనారాయణ, చెన్నంపల్లి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుల కుళ్లాయప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, పట్టణ సహాయకార్యదర్శి రమణ, ముదిగుబ్బ, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 27న సింగిల్ విండో అధ్యక్షుని ప్రమాణ స్వీకారం

- ప్రమాణ స్వీకారోత్సవానికి స్థల పరిశీలన

అగళి, జులై 22 ప్రభాతవార్త



ప్రమాణ స్వీకారోస్తవానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, నాయకులు

ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ విండో అధ్యక్షుల తోపాటు డైరెక్టర్లను త్రిసభ్య కమిటీ ద్వారా నియమించింది. కొత్తగా నామినేటెడ్ అయిన సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, డైరెక్టర్లు ఈ నెల 27వ తేది ఆదివారం ఎంపిడిఓ ఆవరణం ముందు సభను ఏర్పాటు చేయనున్నట్లు, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతోపాటు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరు అవుతారని, అందుకు ప్రమాణ స్వీకార సభ ఏర్పాటు కోసం స్థల పరిశ్శలన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, కన్వీనర్ తిప్పేస్వామి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శిల్పా కెంచు యాదవ్, నాయకులు రాజ్‌గోపాల్, మంజునాథ్, భూతరాజు, డాబా రంగ, లింగరాజు, రాజన్న తదితరులు ఈ స్థల పరిశీలనలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మిటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు...!

ధర్మవరం,జూలై 22(ప్రభాతవార్త)

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ అండర్16 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎంరామకృష్ణప్ప, పీడీ నాగేంద్రలు తెలిపారు. అనంతపురంలోని న్యూటౌన్ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన బాలా బ్యాడ్మిం టన్ అండర్16 విభాగంలో మనోజ్కుమార్, అశోక్, సాయిప్రసాద్ లు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు ప్రకాశం జిల్లాలో వచ్చేనెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం. పీడీతోపాటు ఉపాధ్యాయులు ప్రకాశ్, శ్రీనివాసులు, నాగేంద్ర, లలితమ్మ, నాగరాజు, రామాంజినేయులు అభినందించారు.



బాల్ బ్యాడ్మిటన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీలు

## మాజీ సీఎం అచ్యుతానందకు ఘననివాళి...!

ధర్మవరం, జూలై 22(ప్రభాతవార్త)

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందకు సీపీఎం పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. మంగళవారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో అచ్యుతానంద చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి ఆ పార్టీ నాయకుఉల ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లానాయకులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ...మాజీ సీఎం అచ్యుతానంద 102 సంవత్సరాలుజీవించారని, ఆయన జీవితం సుదీర్ఘపోరాటాలకు మార్గదర్శకమని వరుసగా ఏడుసార్లు ప్రజాప్రతినిధిగా ఉంటూ 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉంటే 1980 నుంచి 1991 వరకు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ అనేకరకాల పోరాటాలకు మార్గదర్శకుడిగా అయ్యారన్నారు. 17 ఏళ్ల వయస్సు నుంచి ఉద్యమంలో కొనసాగాడన్నారు. 1964లో ఉమ్మడి పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన 32 మంది కౌన్సిల్ సభ్యులు విఎస్ ఒకరని, ఇటువం టి మహాయోధుడు మరణించడంతో సీపీఎం పార్టీకి తీరని లోటని కానీ కామ్రేడ్ అచ్చుతానంద ఆశయాలు సాదించడం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిసా మన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సిఐటీయూ మం డల కన్వీనర్ జేవీరమణ, ఎస్ఎఫ్ఎఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, నాయకులు అనిల్, అమన్ రాజు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను అరికట్టాలి.. వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర టౌన్ జూలై 22 ప్రభాతవార్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప

రాష్ట్రంలో ప్రధాన నాయకులే లక్ష్యంగా చేసుకొని రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రతి ఒక్కరి పైన అక్రమ కేసులు పెడుతున్నారని వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప రాష్ట్ర కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం స్థానిక పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో ఎంపీ, మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రతిపక్షం అనేది ఉంటేనే ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని ప్రజలకు మంచి చేస్తుందని అలాంటిది ప్రతిపక్షమే లేకుండా చేసి ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను సైతం అక్రమ అరెస్టులు చేసి ప్రతిపక్షాన్ని అనగ తొక్కుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవహేళన చేసే విధంగా ప్రస్తుత కూటమి తీరు ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గెలిచిన సంవత్సర కాలంలో ముఖ్యమంత్రితో సహా 5 మంది మంత్రులు మడకశిర పర్యటనకు వచ్చారని అయితే అభివృద్ధి చేయకుండా మీరు గొప్ప వాళ్ళు మేము గొప్పవాళ్ళం మనమందరం కలిసాం కాబట్టి ఇక్కడ ఉన్న వాళ్ళందరూ గొప్పవాళ్లే అని ఒకరికొకరు పొగుడుకున్నారే తప్ప మంత్రుల రాకనుండి మడకశిరకు ఒరిగిందేమీ లేదని ఈరలక్కప్ప ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా వైకాపా నాయకుల పై బురద చల్లడం మాని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈరలక్కప్ప హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వైసి గోవర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి. ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి. ఎంపీపీ కవితా. సత్యనారాయణ, మండల కన్వీనర్లు రామిరెడ్డి, త్రిలోక్. సతీష్. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, శ్రీరాములు, తిమ్మప్ప, వివిధ విభాగాల అధ్యక్షులు శేషాద్రి. నరసింహ. సికిందర్. మల్లికార్జున. సర్పంచులు నరసింహమూర్తి, హనుమంత గౌడ్, నాయకులు మంజునాథ్. టిడిపల్లి రంగనాథ్. రుద్రప్ప. నాగభూషణ్ రెడ్డి, గోపి, దను తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఏడాది సంక్షేమ పథకాలు పై విస్తృత ప్రచారం

అమరాపురం జూలై 22 ప్రభాతవార్త



కరపత్రాల పంపిణీ దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం పట్టణం లోని 17వ పరిధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం పై మడకశిర మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో మండల క్లస్టర్ కో కన్వీనర్ చెన్నప్ప సమక్షంలో కరపత్రాల పంపిణీకార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమం నందు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మంజునాథ్, రమేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ యాడ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమిప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను నిరుపేదల కోసం చేపట్టినట్లు వివరించారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో ప్రతి కార్యక్రమం పేద ప్రజల కోసమే చేపట్టుతున్నట్లు వారు వివరించారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవం

గుత్తి, జూలై 22 ప్రభాతవార్త



అమ్మవారికి బోనాలను ప్రదర్శనగా తీసుకెళుతున్న దృశ్యం

గుత్తి పట్టణం లోని కోట ప్రాంతంలో వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు గావించారు. ముత్తైదువులు తమ ఇంటి నుండి చలువతో కూడిన పదార్థాలను బోనాలుగా అమ్మవారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు ప్రదర్శనగా ఆలయానికి తరలివచ్చారు. అనంతరం భక్తాదులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ, భక్తాదులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రంలో చోరీ

గుత్తి, జూలై 22 ప్రభాతవార్త

మండలంలోని ఊబిచర్ల గ్రామంలో వున్న రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రంలో గుర్తుతెలియని అగంతకులు చోరీకి పాల్పడ్డారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో రెండు ప్యాకెట్ల కందులను చోరీ చేశారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో కంప్యూటర్ సిస్టం, సోఫాలు, మందులను చోరీ చేశారు. సంఘటనా స్థలిని ఎంపిడిఓ ప్రభాకర్‌నాయక్ పరిశీలించారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎంపిడిఓ పరిశీలిస్తున్న దృశ్యం



## చింతచెట్టు కొమ్మ విరిగిపడి మహిళ మృతి నివాళులు అర్పించిన ఎంఎల్‌ఏ, మాజీ ఎంఎల్సీ

గుడిబండ జులై 22 ప్రభాతవార్త



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎంఎల్ఏ,మాజీ ఎంఎల్సీ

మండలంలోని మోరబాగలు గ్రామానికి చెందిన తెదేపా పార్టీ బూత్ ఇంచార్జ్ నాగప్ప అతని భార్య అరుణ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చింత కొమ్మ విరిగిపడి అరుణపై పడటం తో మృతి చెందింది. నాగప్ప, అరుణ దంపతులు కరికెర గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న తమ కుమార్తెను చూడడానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చిగతుర్పి సమీపంలో చింత చెట్టు కొమ్మ విరిగి పడడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన గుడిబండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అరుణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## వాతావరణ ఆధారిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

-మండల వ్యవసాయాధికారిని డి.లీనా వసుంధర

గుంతకల్లు, జూలై 22 ప్రభాతవార్త



పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిని వసుంధర

వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారిత బీమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిని డి.లీనా వసుంధర అన్నారు. మంగళవారం మండలంలోని నక్కనదొడ్డి, తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా, అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, యంత్ర పరికరాల సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా గడువు ప్రభుత్వం ఈ నెల 31 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. రైతులు సంబంధిత బ్యాంకులు, సమీపంలోని సర్వీస్ సెంటర్లకు వెళ్లి ప్రీమియం చెల్లించాలని కోరారు. అంతకుముందు ఆముదం, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఇఒ శివరాజ్, ఎంపిఇఒ నాగరాజు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఈ చలాన్ లింక్స్‌తో తస్మాత్ జాగ్రత్త..!!

-వన్ టౌన్ సిఐ బి.మనోహర్



వన్ టౌన్ సిఐ మనోహర్

గుంతకల్లు, జూలై 22 ప్రభాతవార్త

ఈ చలాన్ పేరుతో వచ్చే నకిలీ ఏపికె లింక్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని వన్ టౌన్ సిఐ బి.మనోహర్ హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్‌ను తొందరపడి క్లిక్ చేయకూడదన్నారు. "ఆర్టీఒ ట్రాఫిక్ చలాన్ డాట్ ఏపికె" పేరుతో పలు సామాజిక మాధ్యమాల్లో ఈ లింకు వైరల్ అవుతోందన్నారు. తొందరపడి ఈ లింకును క్లిక్ చేసి డౌన్ లోడ్ చేసుకుంటే వారి ఫోన్ లోని రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు దొంగలించే ప్రమాదం వుందని హెచ్చరించారు. పిఎం కిసాన్ యోజన, ఎస్‌బిఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కెవైసి అప్‌డేట్ పేర్లతో సైబర్ మోసాలకు పాల్పడే నేరగాళ్లు ట్రాఫిక్ చలాన్ పేరుతో కొత్త ఎత్తుగడకు పథకం రచించారన్నారు. అలాగే సెల్ ఫోన్లలో యాప్స్‌ను డౌన్ లోడ్ చేసుకునేవారు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుండే డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. ఓటిపి అలర్ట్‌ను ఎనేబుల్ చేసుకొని, అనుమతులు లేకుండా లావాదేవీలు జరిగినట్లు అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కార్డును బ్లాక్ చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ళ పట్ల ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930కి ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైలు కిందపడి హిజ్రా ఆత్మహత్య

గుత్తి, జూలై 22 ప్రభాతవార్త



వంశీ అలియాస్ శ్రీవాణి (ఫైల్‌ఫోటో)

గుత్తి - పామిడి రైల్వే స్టేషన్ల నడుమ మిడుతూరు సమీపంలో రాగులపల్లి వంశీ అలియాస్ శ్రీవాణి (21) అనే హిజ్రా రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పామిడి మండలం ఎదురూరు గ్రామానికి చెందిన రంగనాయకులు కుమారుడు వంశీ ఎస్‌సి కాలనీలో నివాసం వుండేవాడు. వ్యక్తిగత కారణాలతో అతడు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా గంగమ్మ స్వామి పూజ



ఊరేగింపుగా వెళుతున్న గంగమ్మ స్వామి జలధి కార్యక్రమం

తాడిమర్రి జూలై 22 (ప్రభాతవార్త)

మండల కేంద్రంలో మంగళవారం భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గంగమ్మ స్వామి జలది పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వెండి ఆభరణాలు ప్రత్యేక పుష్పాలంకరణ తో అందంగా అలంకరించి ఉరుముల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా చౌడేశ్వరి దేవి ఆలయం వద్దకు తరలించి జలది పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలోకి అమ్మవారిని ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి జలధి కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

09ATP27_09ATP27.qxd 22-07-2025 PM 11:12 Page 1



## ఘనంగా మారెమ్మ దేవత ఉత్సవ వేడుకలు

అగళి, జులై 22 ప్రభాతవార్త


మారెమ్మదేవతను అలంకరించిన దృశ్యం

మండల కేంద్రమైన అగళితో పాటు రామాపురం, ఎంఎంపాళ్యం, ఆర్‌జి హళ్లి, ఆలూడి తదితర గ్రామాల్లో మారెమ్మ దేవతతోపాటు కరియమ్మ దేవత వేడుకలను భక్తులు వేడుకగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన అగళిలో మూడు గ్రామాలకు కలిసి వేడుకలు నిర్వహించారు. దేవి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో వేపాకులతో అలంకరించారు. అదే విధంగా మహిళలు ప్రత్యేకంగా మంగళవారం గన్నేరు, వేపాకులతో అలంకరించిన దీపాలను ఏర్పాటు చేసి గుడి చుట్టూ మూడు సార్లుప్రదక్షిణలు చేసి గన్నేరు ఆకులను దేవాలయంపై వేశారు. హారతి తీసుకుని ప్రసాదం తీసుకుని భక్తులు వెళ్లారు. విశేష సంఖ్యలో భక్తులు ఆఖరి ఆషాఢ మంగళవారం కావడంతో అది దేవికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఘనంగా వేడుకలను నిర్వహించి, వింధుభోజనం నిర్వహించారు.

## తోట పంటలను పరిశీలించిన ఏపిడి అధికారి ధనుంజయ

బెలుగుప్ప, జులై 22 ప్రభాతవార్త



తోట పంటలను పరిశీలిస్తున్న అధికారి ధనుంజయ

మండల కేంద్రంలో తోటల పంటలను ఏపిడి అధికారి ధనుంజయ పరిశీలించారు. గ్రామాలలో ఉండే తోటలో వేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తూ.. దానికి సంబంధించిన డ్రిప్పు, స్ప్రింక్లర్లను అందజేస్తామని పత్రికా విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదు ఎకరాలలోపు ఉంటే పూర్తిగా సబ్సిడిలో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తామని, 10 ఎకరాలులోపు ఉన్న రైతులకు 90శాతం రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తామని తెలిపారు. 10పైన ఉన్నవారికి 50 శాతం సబ్సిడితో అందజేస్తామని తెలిపారు. ప్రతిఒక్క రైతు దానికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, వన్‌బి అడంగల్ మండల డ్రిప్ అధికారికి అందజేస్తే వెంటనే మంజూరు చేయిస్తామని అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో చోరీలకు విఫలయత్నం


చోరీ జరిగిన వస్త్ర దుకాణం

గుత్తి, జులై 22 ప్రభాతవార్త

గుత్తి పట్టణం నడిబొడ్డున వున్న అమృత థియేటర్ కాంప్లెక్స్‌లో మంగళ వారం తెల్లవారు జామున గుర్తుతెలి యని అగంతకులు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ సంద ర్భంగా రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన వస్త్రదుకాణంలో 400 రూపాయల నగదును అపహరించారు. అదేవిధంగా తాయి వెంకటేష్‌కు చెందిన దుకాణం, శ్రీకాంత్ మొబైల్ దుకాణంలో అగంతకులు చోరీకి విఫలయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గుత్తి స్పెషల్ జైల్ తనిఖీ

గుత్తి, జులై 22 ప్రభాతవార్త


జిల్లా కార్యదర్శి తనిఖీలు చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని స్పెషల్ జైలును మంగళవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం గుత్తి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, అదనపు జిల్లా జడ్జి సాధిక్ బాబు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో వున్న బ్యారెకలు, టాయిలెట్లు, వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యతను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఖైదీలు సత్‌ప్రవర్తనతో మెలగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహేశ్వరుడు, ప్యానెల్ అడ్వకేట్ గంగాధర్‌కుమార్, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తపాలా శాఖ లో 2.0 సేవలు ప్రారంభం

కళ్యాణదుర్గం, జులై 22 ప్రభాతవార్త


కళ్యాణదుర్గంలో 2.0 సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

తపాలా శాఖలో ఐటి 2.0 సేవలు ప్రారంభమైనట్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్టల్ కే చంద్రశేఖర రావు తెలిపారు. మంగళ వారం కళ్యాణదుర్గం సబ్ డివిజనల్ పోస్టల్ కార్యాలయంలో ఐటి 2.0 సేవలు ప్రారంభించిన సందర్భం గా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తపాలా శాఖలో పనిచేసే సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇచ్చి వేగవంతమైన సేవలను అందించడానికి కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం వేగంగా సత్వర సేవలు అందించడమే తమ శాఖ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ పద్మావతి, ఉద్యోగులు మల్లికార్జున, తిమ్మరాజు, ఆరిఫ్ , పెద్దన్న , తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెసి నారాయణ వర్ధంతి వేడుకలు

గుంతకల్లు, జూలై 22 ప్రభాతవార్త


కెసి నారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రముఖ విద్యావేత్త, అనంతపురం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ కరస్పాండెంట్ కెసి నారాయణ 3వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సురేష్‌బాబులు మాట్లాడుతూ కెసి నారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన ఆయన ప్రజలకు నిబద్ధతతో సేవ చేశారని గుర్తు చేశారు. అలాగే ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడానికి ఆయన కృషి మర్చిపోలేనిది అన్నారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తమ్మినేని వెంకటరమణ, బసెట్టి క్రిష్ణయ్య, డాక్టర్ పూజారి గోపి, ఖాజావలి, డాక్టర్ కె.నటరాజ్, డాక్టర్ వరప్రసాద్, కృపాటి రాకేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటు

గుంతకల్లు, జూలై 22 ప్రభాతవార్త


అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కమ్యూనిస్టు ఉద్యమ యోధులు, సిపిఎం అగ్రనేత విఎస్ అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక, రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి అచ్యుతానందన్ అన్నారు. 17 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. అలాగే కేరళ అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారని పేర్కొన్నారు. శ్రమజీవుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, డివైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు షాషావలి, తిమ్మప్ప, బాష, డి.శ్రీనివాసులు, రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఆధారంగా దొంగతనం కేసు ఛేదింపు

గుంతకల్లు, జూలై 22 ప్రభాతవార్త

సిసి కెమెరాల ఆధారంగా ఓ దొంగతనం కేసును వన్ టౌన్ పోలీసులు ఛేదించారు. సిఐ బి.మనోహర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం వుంటున్న షేక్ నబిరసూల్ బళ్ళారి రోడ్డులో ఎండిజి ఇంజనీరింగ్ వర్క్స్, వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 20న ఆదివారం పనులు ముగించుకుని ఇంటికి వెళ్ళాడు. ఉదయం వచ్చి చూడగా షాపు తాళాలు పగలగొట్టి వున్నాయి. అందులో వున్న 1.80 లక్షల రూపాయల విలువ చేసే ఆటోమొబైల్ సామాన్లు దొంగలించబడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు సిసి కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. పట్టణంలోని ఉమామహేశ్వరనగర్ చెందిన పాత నేరస్థుడు దూదేకుల ఇమామ్‌గా గుర్తించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మంగళవారం ఉదయం బళ్లారి రోడ్డు కల్వరి చర్చి వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుండి 1.80 లక్షల విలువ గల ఆటోమొబైల్ సామాన్లు రికవరీ చేసినట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, దుకాణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని దొంగతనాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

## రెండవ సారి సిపిఐ మండల కన్వీనర్ గా బి,కే లక్ష్మీనారాయణ,

తాడిమర్రి జూలై 22 (ప్రభాతవార్త)


సిపిఐ మండల కన్వీనర్‌గా ఎన్నికైన బికే లక్ష్మీనారాయణ

సిపిఐ తాడిమర్రి మండల కన్వీనర్ గా బికే లక్ష్మీనారాయణ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, గతంలో పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పని చేసినందుకు డివిజన్ నాయకులు గుర్తించి లక్ష్మీనారాయణ కు రెండవసారి కన్వీనర్‌గా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సిపిఐపార్టీని బలోపేతం చేయడంతో పాటు రైతులు, రైతు కూలీలు,పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తమకు రెండవ సారి కన్వీనర్ గా అవకాశం కల్పించిన సిపిఐ నియోజకవర్గం మరియు డివిజన్ నాయకులకు మండల నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నానని అన్నారు.

## కరియమ్మ జాతర వేడుకల్లో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

అగళి, జులై 22 ప్రభాతవార్త

మండలపరిధిలోని ఆలూడి గ్రామంలో వెలిసిన పురాతన కరియమ్మదేవత జాతర ఉత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. కరియమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. పూజల్లో పాల్గొన్న అనంతరం తమ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి ప్రసాదాలను స్వీకరించారు. కరియమ్మ జారత వేడుకల్లో ప్రతి యేటా ఘనంగా జరుపుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఊరికి మంచి జరుగుతుందని, రోగాలు దరి చేరవని, ఐశ్వర్యం సిద్ధిస్తుందన్న ఉద్దేశ్యంతో కరియమ్మ జాతర ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బసవరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, కన్వీనర్ తిప్పేస్వామి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శిల్ప కెంచు యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు జయరామ్, రాజ్‌గోపాల్, గిరీష్, రమేష్, మంజునాథ్, బూతరాజు, సురేష్, నరసింహమూర్తి, మాజీ ఎంపిపి నరసింహయ్య, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ సాగులో మెలకువలు పాటిస్తే రైతులకు అధిక లాభాలు.

కనగానపల్లి జూలై 22 ప్రభాతవార్త


మాట్లాడుతున్న అగ్రికల్చర్ ఏడిఏ లక్ష్మణ్ నాయక్.

మండల కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం అగ్రికల్చర్ ఏ డి ఏ లక్ష్మణ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి బి. మాధురి తో కలిసి ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుచేసిన వేరుశనగ పొలాన్ని వారు పరిశీలించారు.ఈ సందర్భంగా ఏడిఏ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసే పద్ధతులపై రైతులకు విత్తన శుద్ధి అలాగే కలుపు నివారణ పూత దశలో మందుల వాడకంపై అలాగే గింజ నాణ్యతగా ఉండడానికి కావలసిన మెలకువలు రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ వీరాంజనేయులు, విహెచ్ఏ రమ్యకృష్ణ, ఎంపీఈవో జయ రాములు, రైతులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న కారు

- ఐదు మందికి తీవ్ర గాయాలు

లేపాక్షి, జూలై 22 ప్రభాతవార్త


పంటపొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో, దెబ్బతిన్న కారు

మండలంలోని కొర్లపల్లి గ్రామసమీపంలో ఆటోను కారుఢీకొన్న ప్రమాదం లో ఐదు మందికి తీవ్ర గాయాలు కాగా మరో 10మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు ఇలావున్నాయి. చిలమత్తూరు మండలం కోడూరు సమీపంలోని గార్మెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో కొండూరు గ్రామానికి ఆటో వెళుతోంది. కుర్లపల్లి సమీపానికి రాగానే కొండూరు వైపు నుండి లేపాక్షి వస్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో పంట పొలాల్లోకి దూసుకు వెళ్ళింది. ఈ సంఘటనలో ఐదు మందికి తీవ్ర గాయాలయ్యారు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు తీవ్రంగా గాయపడ్డ ఐదుగురిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్సులో తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పులబాదతో చేనేత కార్మికుడి ఉరివేసుకుని ఆత్మహత్య

ధర్మవరం, జూలై 22(ప్రభాతవార్త)


ఆత్మహత్య చేసుకున్న లక్ష్మీప్రసాద్ ఫైల్ ఫోటో

అప్పులబాధతో ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇందిరమ్మకాలనీలో సోమవారం రాత్రి జరిగింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు...పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మీప్రసాద్ కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుటున్నాడు. అయితే లక్ష్మీప్రసాద్ మద్యానికి బానిసై ప్రతి రోజు మద్యం తాగుతూ మగ్గంపనులు చేయకుండా ఉండేవాడు. ఇంటిఖర్చులకు, తాగుడుకు తెలిసిన వారు,బంధువుల వద్ద నుంచి అప్పులు చేశాడు.దాదాపు రూ.3లక్షల దాకా అప్పులుచేశాడు.అయితే ఆ అప్పులను ఎలా తీర్చాలో దిక్కుతోచక తనలో తాను మనస్థాపానికి గురయ్యేవాడు. తాను చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. అప్పులు తీరుతాయనిదైర్యంగా ఉండాలని తండ్రి మస్తానప్ప, మృతుడి భార్య కుసుమ దైర్యం చెప్పేవారు. మూడురోజుల క్రితం మృతుని భార్య కుసుమ తన అడపడచు శివజ్యోతికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమెను చూసుకోవడానికి అనంతపురంకు వెళ్లింది.ఈ క్రమంలో సోమవారం రాత్రి లక్ష్మీప్రసాద్ ఇనుపతీరుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మృతుడు లక్ష్మీప్రసాదు భార్య కుసుమ పోన్ చేసింది, ఎన్నిసార్లు పోన్ చేసిన స్పందించకపోవడంతో ఆమె లక్ష్మీప్రసాద్ తండ్రి మస్తానప్పకు పోన్ చేసి విషయం తెలిపింది. దీంతో ఆయన ఇందిరమ్మకాలనీలోని లక్ష్మీప్రసాద్ పక్క ఇంటిలో ఉన్న గురుమూర్తికి లక్ష్మీప్రసాద్ ఇంటిలో ఉన్నాడా లేదా చూడమని చెప్పాడు. గురుప్రసాద్ ఇంటి వద్దకు వెళ్లి చూడగా లక్ష్మీప్రసాద్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న మృతుని తండ్రికి సమాచారం అందించాడు. దీంతో విషయంతెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని తండ్రి మస్తానప్ప పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టంనిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య కుసుమతోపాటు కుమార్తె మన్విత ఉంది. మన్విత సీకేపల్లి హాస్టల్లో ఉంటూ 10వ తరగతి చదువుతోంది.

## ఘనంగా మొహరం వేడుకలు.


జలదికి వెళుతున్న పీర్లు.

కనగానపల్లి జూలై 22 ప్రభాతవార్త

మండలంలోని తూముచెర్ల, తగరకుంట, మద్దెల చెరువు గ్రామాల్లో మంగళవారం మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి పీర్లను అందంగా అలంకరించి యువకులు కేరింతల మధ్య అలావ్ తొక్కుతూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం పీర్లు జలదికి తరలి వెళ్లాయి.

## సీపీఐ పట్టణనూతన కమిటి ఎంపిక...!

ధర్మవరం, జూలై 22(ప్రభాతవార్త)


సీపీఐ పట్టణ నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు

సీపీఐ పట్టణ నూతన కమిటీని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సోమవారం స్థానిక ఎన్జీఓహోంలో నిర్వహించిన నియోజకవర్గ 8వ సీపీఐ మహాసభలలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ఆధ్వర్యంలో పట్టణసీపీఐ నూతన కమిటీని ఎంపికచేశారు. నూతన కమిటి పట్టణ కార్యదర్శిగా మూలశెట్టి రవికుమార్, సహాయకార్యదర్శులుగా ఎర్రంశెట్టిరమణ, శ్రీనివాసులను రెండవ సారి ఎంపికచేశారు. కార్యవర్గసభ్యులుగా వెంకటస్వామి, వెం కటన్నారాయణ,రాజా, చెన్నంపల్లి శ్రీనివాసులు, శ్రీదర్, ఆదినారాయణ, శ్రీనివాసులర, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, మసూద్, ఈశ్వర్, జనార్ధన్, లలితమ్మ, లింగమ్మలను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. వీరిని వేమయ్యాయాదవ్ పాటు చేతివృత్తిదారుల సంఘంరాష్ట్ర అధ్యక్షుడు జింకాచలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమదు. శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డుకు నష్టం చేసినందుకు రైతులపై కేసు నమోదు

కొత్తచెరువు జులై 22 ప్రభాతవార్త.

కొత్తచెరువు మండల పరిధిలోని ఇరగలపల్లి గ్రామం నుంచి తలమర్ల కి పంచాయితీ రోడ్డు వేస్తుండగా కొంతమంది రైతులు రోడ్డు కి ఉన్న మట్టి కంకర తొలగించడం పై కాంట్రాక్టర్ యం.రమణారెడ్డి సీఐ జీఎం శంకర్ ఫిర్యాదు చేశారు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ నిధులతో నిర్మిస్తున్న తారు రోడ్డుకు నష్టం చేయడంతో నలుగురు రైతులపై కేసు నమోదు చేశారురోడ్డుకు దాదాపు 250 మీటర్ల పొడవులో మట్టి, మెటల్ తొలగించడంతో, ఆ నిర్మాణానికి రూ.2,50,000 విలువైన నష్టం సంభవించినట్లు ఆయన తెలిపారు.

## హోటల్స్,ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

నిర్వహకులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి

జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర



సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

కొత్తచెరువు జూలై 22 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా లో వివిధ హోటల్లో, హాస్టల్స్, స్కూల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ను జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర సహాయకులు గణేష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ ల్యాబ్ కి పంపడం జరిగిందని తెలిపారు ఫుడ్ సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ ధర్మవరంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహంను ఫుడ్‌సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా హాస్టల్లో పరిశుభ్రతను, ఆహార పదార్థాలు కి సంబంధించిన ధాన్యాలు తదితర వాటి యొక్క నాణ్యత పరిశీలించి వార్డెన్ కి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అలాగే నైరా హైస్కూలను సందర్శించి ఆ స్కూల్లో స్టోర్ యొక్క గదిని పరిశీలించి ఆహార పదార్థాలు సంబంధించిన వాటిని శాంపిల్స్ కు ల్యాబ్ కి పంపడం జరిగిందన్నారు. అలాగే కొత్తచెరువు మండల కేంద్రంలో బుక్కపట్నం రోడ్డు పుట్టపర్తి రోడ్డు పెనుగొండ రోడ్డులో ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు హోటలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు వీటిలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వాడే ఆయిల్ యొక్క నాణ్యతను పరిశీలించారు. గోబిలో వాడే వివిధ రకాల కలర్స్ టెస్టింగ్ సాల్ట్ కొన్ని హోటల్స్ లో చాలా రోజుల నుంచి నిలువ ఉంచిన చేపలు చికెన్ ఉండడంతో అధికారుల వెంటనే వాటిని తీసి బయట పడవేశారు ఇలాంటి హోటల్ పైన తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తోపుడు బండ్ల రోడ్డు మీదనే ఉండడం వల్ల ఆహార పదార్థాల మీద దుమ్ము ధూళి పడడంతోపాటు ఎగ్‌రైస్, గోబీరైస్ నిర్వాహకులు హోటల్స్ రెస్టారెంట్లు ప్రతి ఒక్కరూ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు వారికి తెలియజేశారు లైసెన్సు లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.

## బాల్య వివాహాల నిర్మూలన మనందరి బాధ్యత

-బాల్య వివాహాల నిర్మూలన గోడపత్రికలు విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

లేపాక్షి, జూలై 22 ప్రభాతవార్త

బాల్య వివాహాల నిర్మూలనపై మండల కేంద్రమైన లేపాక్షి వెలుగు కార్యక్రమంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సిడిపిఒ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపిడిఒ నరసింహమూర్తి, ఏపిఎం జయచంద్రలతో పాటు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాల నిర్మూలనకు పలు చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఎంపిడిఒ నరసింహమూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలు అనారోగ్య హేతువులు అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సిడిపిఒ వరలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు బాల్య వివాహ నిరోధక కమిటీలను, బాలల హక్కుల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు ప్రతి గ్రామంలోను బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కమిటీలకు విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి కార్యకర్తలు, మహిళా పోలీసులు సహకరించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, జయమ్మ, ప్రొటెక్షన్ అధికారి నాగలక్ష్మి, సోషల్ వర్కర్ వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ఎన్ఎస్‌యుఐ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జులై 22 ప్రభాతవార్త

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి ఆధ్వర్యంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద మంగళవారం ఎన్ఎస్‌యుఐ నాయకుడి ఉదిత్‌ప్రధాన్ యొక్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఒడిస్సా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రధాన్ 19 ఏళ్ల విద్యార్థిని తినడానికి అని చెప్పి తీసుకొని వెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి 9 ఏళ్ల విద్యార్థిని వేధిస్తూ అత్యాచారం చేయడాన్ని జరిగిందన్నారు. ఇందుకు నిరసనగా దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఎన్ఎస్‌యుఐ ఒడిస్సా అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎబివిపి విశ్వవిద్యాలయ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, కన్వీనర్ అభిరామ్ మాట్లాడుతూ.. ఇలాంటి తప్పుడు కార్యకలాపాలు చేస్తూ కామాంధులను తయారు చేస్తున్న ఎన్ఎస్‌యుఐ లాంటి విద్యార్థి సంఘాన్ని తక్షణమే దేశంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆ యొక్క విద్యార్థినికి, తల్లిదండ్రులకు ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని ఇటువంటి మానవ మృగాలను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, అమర్ శ్రీధర్, శ్రావణి, నయన, నిశిత, దివాకర్ నాయక్, బాబు హితేష్ నాయక్, విష్ణు పాల్గొన్నారు.

## 100 శాతం సుపరిపాలన కార్యక్రమం పూర్తి

- నాయకులను అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం కలెక్టరేట్, జూలై 22 ప్రభాతవార్త

అనంతపురం నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని 100 శాతం పూర్తిచేసిన నాయకులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని 36 మంది బూత్ ఇన్‌చార్జ్‌లు సుపరిపాలన కార్యక్రమాన్ని వందకు వంద శాతం పూర్తి చేశారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని వందశాతం పూర్తిచేసిన 36 మంది బూత్ ఇన్‌చార్జ్‌లను, ఆ పరిధిలోని టిడిపి నాయకులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. మరో 10 రోజులు గడువు ఉన్న నేపథ్యంలో మిగిలిన బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులంతా సుపరిపాలన కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

